సాక్షి
అనంతపురం

గురువారం ॥ 3 ॥ ఏప్రిల్ ॥ 2025



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



వైభవంగా సిడిమాను ఉత్సవం

రాయదుర్గంలో బుధవారం రససిద్ధుల కొండపై సిడిమాను ఉత్సవం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

38.5°/21.1°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృత మైంది. వేసవితాపం కొనసాగింది.

న్యూస్‌రీల్

అప్పు రాబట్టుకునేందుకు మహిళ 'క్షుద్ర' నాటకం!

కణేకల్లు: అప్పును రాబట్టుకోవాలనుకునే ఉద్దేశంతో ఓ మహిళ క్షుద్ర నాటకానికి తెరలేపింది. పోలీసులను బురిడీ కొట్టించి చివరికి తెల్లమొహమేసింది. వివరాలు... కణేకల్లులోని దిగువ వీధిలో నివాసముంటున్న కురుబ చిక్కమ్మ 2వ వార్డులో నివాసముంటున్న రైతు చాంద్‌బాషకు రూ.1.50 లక్షల అప్పు ఇచ్చింది. అసలు, వడ్డీ కలిపి రూ.3 లక్షలు కాగా, ఇటీవల అప్పు చెల్లించాలని ఆమె చాంద్‌బాషను కోరింది. అయితే, పంటలు పండక అప్పుల్లో కూరుకుపోయానంటూ చాంద్‌బాష ఆమెకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.60 వేలు చెల్లించాడు. ఈ క్రమంలోనే అప్పులోళ్ల వేధింపులు తట్టుకోలేక చాంద్‌బాష రెండు నెలల క్రితం ఇల్లు వదిలేసి వెళ్లిపోయాడు. అయితే, మిగిలిన డబ్బును ఎలాగైనా చాంద్‌బాష కుటుంబ సభ్యుల నుంచి వసూలు చేయాలని భావించిన చిక్కమ్మ ఓ ప్లాన్ వేసింది. మంగళవారం అర్ధరాత్రి చాంద్‌బాష భార్య, కుమారుడు, కుమార్తె, సోదరుడు జాఫర్, కొందరు మహిళలు తన ఇంటి ముందు క్షుద్రపూజలు చేసి ఆ తర్వాత బీరువాలో ఉన్న రూ.3 లక్షల డబ్బు, చెవి కమ్మలు, 4 తులాల బంగారు, ప్రాంసరీ నోట్లను తీసుకెళ్లడంతో పాటు హత్య చేసేందుకు యత్నించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వార్త దావానంలా వ్యాప్తించడంతో కణేకల్లు ప్రజలు ఉలిక్కిపడ్డారు. విషయాన్ని ఎస్‌ఐ నాగమధు ద్వారా తెలుసుకున్న ఎస్పీ జగదీష్ సీరియస్‌గా తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్ ఘటనాస్థలిలో వేలిముద్రలను సేకరించింది. సాయంత్రం డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించగా.. చిక్కమ్మ ఇంట్లోకి ప్రవేశించిన జాగిలం ఎక్కడెక్కడో తిరిగి చివరికి ఇంట్లోకే రావడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. ఈ క్రమంలోనే పోలీసులు తమదైన శైలిలో చిక్కమ్మను విచారించగా... చేసిన తప్పును అంగీకరించింది. డబ్బివ్వకపోవడంతో తానే ఇలా ప్లాన్ చేశానని ఒప్పుకుంది. దీనిపై సీఐ వెంకటరమణ మాట్లాడుతూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసిన చిక్కమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. తాము ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ఐదుగురు అమాయకుల జీవితాలు బలైపోయేవన్నారు. పోలీసులకు తప్పుడు ఫిర్యాదులిచ్చి మభ్యపెట్టాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఆ హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: పరీక్ష సమయంలో విద్యార్థిని వద్ద ప్రశ్నపత్రం కనిపించలేదనే నెపంతో విచక్షణ కోల్పోయి విద్యార్థిని భుజపుటెముక విరిగేలా చితకబాదిన ఘటనలో ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. గత నెల 29న ఆత్మకూరు పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న కేజీబీవీ విద్యార్థిని ప్రశ్నపత్రం తన టేబుల్ నుంచి కిందకు పడిపోయింది. అప్పటికే ఆ అమ్మాయి తెలిసిన ప్రశ్నలన్నింటికీ జవాబులు రాసి కూర్చుంది. ఈ క్రమంలోనే ప్రశ్నపత్రం కిందకు పడిపోయి గాలికి వెనుక వైపు బెంచీవద్దకు వెళ్లింది. ఇదే సమయంలో చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసప్రసాద్ గదికి చేరుకున్నాడు. పరిశీలిస్తున్న క్రమంలో విద్యార్థిని వద్దకు వెళ్లాడు. ఆన్సర్ షీటు మాత్రమే కనిపించడంతో ప్రశ్నపత్రం ఎక్కడ.. అని అడిగాడు. హఠాత్పరిణామంతో విద్యార్థిని ఆందోళనకు గురైంది. ఇక్కడే ఉందంటూ వెతుకుతుండగా ఒక్కసారిగా కర్రతో విద్యార్థినిని చితకబాదాడు. ఈ క్రమంలోనే ఆమె భుజపుటెముక విరిగింది. దీంతో తర్వాత రోజు పరీక్ష రాయలేని పరిస్థితి. ఈ పరిణామంపై 'సాక్షి'లో 'శ్రీనివాసా...ఇదెక్కడి 'కర్ర పెత్తనం' శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై విద్యాశాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. స్వయంగా పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ఘటనపై ఆరా తీశారు. విద్యార్థినిది ఏమాత్రం తప్పు లేదని, హెచ్‌ఎం అతిగా స్పందించాడంటూ జిల్లా అధికారులు వివరించడంతో సదరు హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా ఘటనను తీవ్రంగా పరిగణించారు. మూడు రోజులుగా స్వయంగా డీఈఓ ప్రసాద్ బాబును పిలిపించి ఆరా తీశారు. హెచ్‌ఎంపై ఏ మేరకు చర్యలు తీసుకోవచ్చో తెలపాలంటూ ఆదేశించారు. ఈ పరిణామాలను బట్టి చూస్తుంటే అకారణంగా విద్యార్థినిని చితకబాదిన హెచ్‌ఎంపై ఉచ్చు బిగుస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

చెప్పింది చేయకుంటే చిత్తడే!

ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీసుల తీరు ఇటీవలి కాలంలో తీవ్ర వివాదాస్పదమవుతోంది. 'బాస్'లు కూడా తమకేమీ తెలియనట్లే ఉంటుండటంతో 'పచ్చ' నేతల అడుగులకు మడుగులొత్తడమే పనైపోయింది. శాంతిభద్రతల పర్యవేక్షణ పట్టడం లేదు. ప్రజల రక్షణ సంగతే గుర్తుకు రావడం లేదు. ఎంత సేపూ ఎమ్మెల్యేలు చెప్పినట్లే చేసుకుంటూ పోతున్నారు.



నలిగిపోతున్న నాలుగో సింహం

- ఎమ్మెల్యేలు గీసిన హద్దులే పోలీసులకు లక్ష్మణరేఖలు
- గీత దాటితే శంకరగిరి మాన్యాలు పట్టిస్తామని పరోక్ష హెచ్చరికలు
- ఇటీవల సీఐ కరుణాకర్ ఘటనతో స్థైర్యం కోల్పోయిన పోలీసులు
- ఎస్‌ఐ వీరంగం చేసినా కనీస చర్యలు తీసుకోలేని 'శ్రీ సత్యసాయి' జిల్లా ఎస్పీ
- తాడిపత్రిలో ఐపీఎస్ అధికారి ఆఫీసుకే పరిమితం
- సీఐల కనీస బాధలు పట్టించుకోలేని స్థితిలో పోలీసు బాస్‌లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'నాలుగు గోడల మధ్య బంధిస్తే పిల్లి కూడా పులి అవుతుంది' అని నానుడి. కానీ ఇప్పుడు నాలుగు గోడల వెలుపల ఉన్నా పోలీసులు పులులు కాలేకపోతున్నారు. ఎమ్మెల్యేలే పెద్దపులి పాత్ర పోషించి పోలీసులతో ఆడుకుంటున్నారు. ఎక్కడైనా బాధితులకు న్యాయం చేయడానికి పోలీసులు ఒక అడుగు ముందుకేసినా 24 గంటల్లోనే వేటు తప్పడం లేదు. ఏ నియోజకవర్గంలో అయినా ఎమ్మెల్యేలు గీసిన హద్దులే పోలీసులకు లక్ష్మణ రేఖలుగా మారాయి. గీత దాటారో వేరే స్టేషన్ చూసుకోవాల్సిందే. లేదంటే వీఆర్‌కు పంపించి వేతనం రాకుండా చేస్తారు.. ఇదీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో దుస్థితి. 'శాంతిభద్రతలు, రూల్స్, లా ఇవన్నీ మీకెందుకు.. పచ్చచొక్కా వేసుకొస్తే సెల్యూట్ కొట్టు.. లేదంటే పెట్టేబేడా సర్దుకు పోతావ్!' అంటూ ఎమ్మెల్యేలు హెచ్చరిస్తున్నారు.

కరుణాకర్‌కు పట్టిన గతే మీకూ..

సంబంధం లేని పంచాయితీలో తలదూర్చిన ఓ వ్యక్తిని ఇటీవల బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్ మందలించారు. దీంతో 24 గంటలు గడవకముందే ఆయన్ను వీఆర్‌కు పంపించారు. ఎమ్మెల్యే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు. సీఐది కూడా అదే సామాజిక వర్గం. కానీ ఆయన్ను కాపాడుకోవడం అటుంచి వెంటనే వెళ్లగొట్టారు. మిగతా సీఐలకు ఇది హెచ్చరిక అంటూ కొంతమంది ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. తమ అనుమతి లేకుండా ఏదైనా చేస్తే కరుణాకర్ లాగే బదిలీపై వెళతారని హెచ్చరిస్తున్నారు. కరుణాకర్ బదిలీతో రెండు జిల్లాల్లోనూ సీఐలు.. ఎస్పీ లేమోగానీ ఎమ్మెల్యేలను కాదని ఏపనీ చేయలేక పోతున్నారు.

బరితెగిస్తే ఓకే..

రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ లాగా బరితెగించి టీడీపీకి బానిసగా ఉంటే ఓకే అన్నట్టు ఉన్నతాధికారులు సంకేతాలిచ్చారు. ఇటీవల 20 మంది గుంపుగా వచ్చి పాపిరెడ్డిపల్లి లింగమయ్యపై దాడిచేస్తే కేవలం ఇద్దరిపైనే కేసు నమోదు చేశారు. ఎంపీపీ ఎన్నికల్లో సుధాకర్ యాదవ్ పసుపు కండువా వేసుకున్నంత పని చేశారు. ఎమ్మెల్యే పరిటాల ఇంట్లో పనిమనిషి కంటే అధ్వానంగా పనిచేశారని పోలీసు వర్గాలే చెబుతున్నాయి. అలాంటి ఎస్‌ఐపై శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కనీసం చర్యలు తీసుకోలేక పోయారు. సుధాకర్ బరితెగించి ప్రవర్తిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎస్పీలు తమను రక్షించే పరిస్థితిలో లేరని భావించి సీఐలు కూడా ఎమ్మెల్యేలు చెప్పినట్టే వింటున్నారు.

ఇద్దరూ నిస్సహాయ స్థితిలోనే..

తాడిపత్రిలో ఐపీఎస్ అధికారిని వేసినా పనిచేయలేని పరిస్థితి. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగడాలకు హద్దు లేకుండా పోయినా ఎస్పీ జగదీష్ నోరు మెదపలేని దుస్థితి. చివరకు ముస్లిం నేతలు ఇఫ్తార్ విందు చేసుకుంటామన్నా జేసీ ఉండనివ్వలేదు. కనీసం దీనిపై కూడా ఎస్పీ నోరువిప్పలేదు. పుట్టపర్తి నియోజకవర్గంలో రాజకీయ నేతలే రూ. కోట్లలో జూదం ఆడిస్తున్నా చర్యలు అస్సలు కానరావడం లేదు. తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో గంజాయి విక్రయాలతో పాటు జూదం విచ్చలవిడిగా సాగుతున్నా ఎస్పీ నోరు మెదపరు. గత ప్రభుత్వ హయాంలో ఖాకీ యూనిఫాంను నమ్ముకుని పనిచేసిన పోలీసులు ఇప్పుడు ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాల మీద పని చేయాల్సి వస్తోంది.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

వజ్రకరూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండా (రూపానాయక్ తండా)కు చెందిన రమావత్ రూప్లానాయక్ (28)కు భార్య కమలమ్మ, ఓ కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఇటీవల తన నివాసం ఎదురుగానే నూతన గృహ నిర్మాణాన్ని రూప్లానాయక్ చేపట్టాడు. బుధవారం ఉదయం నిర్మాణంలో ఉన్న గోడలకు క్యూరింగ్ చేసేందుకు విద్యుత్ మోటారు సాయంతో నీటిని కొడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఉదానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో విధ్వంసం

ఆత్మకూరు: స్థానిక నార్త్ ప్రభుత్వ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విధ్వంసానికి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి పాఠశాలలోని మూడు గదులకు సంబంధించిన తలుపులను రాడ్‌తో బద్దలుకొట్టారు. బీరువాలను ధ్వంసం చేసి, అందులోని సామగ్రిని చిందరవందర చేశారు. అయితే విధ్వంసానికి పాల్పడిన వారు ఎలాంటి వస్తువులూ ఎత్తుకెళ్లకపోవడం గమనార్హం. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు విషయాన్ని గుర్తించి, స్థానికులను పిలిపించి చూపించారు. ఇలాంటి పనులు చేయడం ఇది మొదటిసారి కాదని, గతంలోనూ రెండు, మూడు సార్లు తలుపులు బద్దలుగొట్టి వస్తువులను ధ్వంసం చేశారంటూ ఉపాధ్యాయులు తెలిపారు. విధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను కోరారు.

అరాచకాలను తిప్పికొడతాం

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ అండగా ఉంటారు
- ఈ నెల 8న రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి జగన్ రాక
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'స్థానిక సంస్థల ఎన్నికల్లో రాప్తాడు, కదిరి ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. తమకు మెజారిటీ లేదని, ఎంపీపీ అభ్యర్థి లేరని చెప్పిన ఎమ్మెల్యే పరిటాల సునీత రామగిరిలో అరాచకం సృష్టించారు. 20 ఏళ్ల క్రితం పరిస్థితులను మళ్లీ తీసుకురావాలని అనుకుంటున్నారా.. టీడీపీ అరాచకాలను ప్రజాస్వామ్య పద్ధతిలోనే తిప్పికొడతాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినా ఉప ఎన్నికల్లో 51 స్థానాలకు గానూ 39 స్థానాల్లో తమ పార్టీ విజయం సాధించిందన్నారు. టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాపిరెడ్డి పల్లికి రానున్నారని, ప్రతి కార్యకర్త, నాయకులు, నేతలకు జగన్ అండగా ఉంటారన్నారు.

పోలీసు శాఖ ఫెయిల్యూర్..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసు శాఖ విఫలమైందని 'అనంత' విమర్శించారు. సీఎం చంద్రబాబు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల పింఛన్లకు కోత పెట్టారన్నారు. ప్రస్తుతమున్న పింఛన్ లబ్ధిదారులకు రూ.33,800 కోట్లు అవసరమున్నా, బడ్జెట్‌లో కేవలం రూ.27 వేల కోట్లు కేటాయించారని, దీన్ని బట్టి రానున్న రోజుల్లో భారీగా పింఛన్ల కోత పెట్టనున్నట్లు అర్థమవుతోందన్నారు. పీ–4 అనేది ఒక బూటకమని విమర్శించారు. వైఎస్ జగన్ ఐదేళ్లలో నొక్కిన బటన్లన్నీ తాను పింఛన్ల కోసం నొక్కిన బటన్‌తో సమానమని చంద్రబాబు వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. జగన్ బటన్ నొక్కితే ప్రజల ఖాతాల్లో నేరుగా రూ.2.72 లక్షల కోట్లు జమ అయిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాకు తీరని అన్యాయం జరుగుతున్నా మంత్రులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఎన్నడూ లేనివిధంగా జిల్లాకు హెచ్‌ఎల్‌సీ, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా సుమారు 55 టీఎంసీలు వస్తే కేవలం 55 వేల ఎకరాలకు అందించినట్లు కలెక్టర్ ప్రకటించారంటే ఇంతకంటే దారుణం మరొకటి ఉంటుందా అని పేర్కొన్నారు. ఒక టీఎంసీ నీరు 9 వేల ఎకరాలకు రావాలని, ఈ క్రమంలో దాదాపు 4.50 లక్షల ఎకరాలకు ఇవ్వాల్సి ఉంటే కేవలం 55 వేల ఎకరాలకు మాత్రమే ఇచ్చారన్నారు. పీఏబీఆర్‌లో 5 టీఎంసీలు నిల్వ చేసుకున్నారా అంటే అదీ లేదన్నారు. పెనకచెర్లలో 0.5 టీఎంసీలు కూడా లేవన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మీసాల రంగన్న, పుల్లయ్య, చామలూరు రాజగోపాల్, వేణు, కేశవరెడ్డి, కుళ్లాయస్వామి, దేవి, పార్వతి, కార్పొరేటర్లు కమల్ భూషణ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవం

అనంతపురం: మహిళను హత్య చేసిన కేసులో ముద్దాయికి కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు.. అనంతపురం రంగస్వామి నగర్‌లో నివాసం ఉంటున్న రవి, రామాంజినమ్మ (25) దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. రామాంజినమ్మకు నార్పల మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన దూదేకుల సిద్ధయ్యతో ఏర్పడిన పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇద్దరూ ఎక్కిడికైనా వెళ్లి జీవిద్దామనుకుని సిద్ధయ్య వెంట రామాంజినమ్మ కొన్ని రోజులకే వెళ్లిపోయింది. అలా వెళ్లిన వీరు కళ్యాణదుర్గం రోడ్డు బైపాస్ సమీపంలోని ఒక గదిలో తలదాచుకున్నారు. ఈ క్రమంలో రామాంజినమ్మ తన వెంట తెచ్చుకున్న బంగారు, నగదుపై సిద్ధయ్య కన్నేశాడు. ఆమెను మభ్య పెట్టి 5 తులాల బంగారు, నగలు, రూ.3 వేలు తీసుకుని ఆటో కొనుగోలు చేశాడు. తనను వివాహం చేసుకోవాలని సిద్ధయ్యను రామాంజినమ్మ కోరడంతో ఆమెను హతమార్చాలని నిశ్చయించుకున్నాడు. ప్రస్తుతం తామున్న ఇంటిని ఖాళీ చేద్దామని, నగర శివారులోని సెయింట్ ఆన్స్ స్కూలు సమీపంలోని మబ్బుకొట్టాలలో తాను చూసిన ఇంట్లో చేరదామని చెప్పి అనుమానం రాకుండా కొన్ని సామాన్లతో 2014 ఫిబ్రవరి 25న ఆటోలో రామాంజినమ్మను ఎక్కించుకుని బయలుదేరాడు. నగర పరిధిలోని ఇంద్రజిత్ నగర్ వద్ద కంపచెట్లలోకి తీసుకెళ్లి బండరాయితో మోది దారుణంగా హత్య చేశాడు.అనంతరం మృతదేహంపై పెట్రోలు పోసి నిప్పంటించి వెళ్లిపోయాడు. హత్య చేసిన మూడు రోజుల తర్వాత మళ్లీ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించాడు. మృతదేహం కంపు కొట్టడంతో పాటు గుర్తు పట్టలేని రీతిలో ఉండటంతో ఇక తనకేం ఇబ్బంది ఉండదని భావించి, అక్కడి నుంచి నేరుగా గోరంట్లలో పూల వ్యాపారం చేసే తన అన్న వద్దకు చేరుకున్నాడు. సిద్ధయ్య నడవడికపై అప్పటి గోరంట్ల ఎస్‌ఐకి అనుమానం వచ్చి విచారించగా, రామాంజినమ్మ హత్య విషయం వెలుగు చూసింది. ఈ క్రమంలోనే మృతురాలి భర్త వడ్డే రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తుండగా, ముద్దాయి సిద్ధయ్య వీఆర్వో వద్ద లొంగిపోయాడు. దీనిపై అప్పట్లో సీఐగా ఉన్న దేవానంద్ కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. అనంతపురంలోని నాలుగో అదనపు జిల్లా కోర్టులో కేసు నడిచింది. కేసులో 8 మంది సాక్షులను నాలుగో అదనపు జిల్లా జడ్జి శోభారాణి విచారించారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో బుధవారం తీర్పు వెలువరించారు. దూదేకుల సిద్ధయ్యకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సుజన వాదించారు. కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేష్ నాయక్, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు (ఏఎస్‌ఐ), కోర్టు కానిస్టేబుల్ శౌ రెడ్డి, త్రీ టౌన్ పీసీ హెచ్. నాగరాజులు నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు.



ముద్దాయి సిద్ధయ్య



రామాంజినమ్మ (ఫైల్)

రోగులకు నాణ్యమైన వైద్యం అందాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వస్తుంటారని, ఇక్కడకు వచ్చే వారికి నాణ్యమైన వైద్య సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో హెచ్‌ఓడీలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. వృత్తి ధర్మాన్ని పాటించాలన్నారు. సర్వజనాస్పత్రి, వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీల అభివృద్ధికి పాటుపడాలన్నారు. పీజీ సీట్లు, సీనియర్ రెసిడెంట్స్ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావును ఆదేశించారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును ఆదేశించారు. ఉమ్మడి జిల్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న విషయాన్ని మరువొద్దన్నారు. రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చూడాలన్నారు.

పేషంట్ అటెండర్స్‌తో సమస్య..

సర్వజనాస్పత్రిలో పేషంట్ అటెండర్స్ అధికంగా ఉంటున్నారని, మహిళలుండే వార్డుల్లోకి పురుషులు వస్తున్నారని గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వివిధ వార్డులోనూ ఇదే సమస్య నెలకొందని హెచ్‌ఓడీలు తెలిపారు. దీంతో ఇన్‌ఫెక్షన్ రేటు అధికమయ్యే సమస్య ఉందన్నారు. స్పందించిన కలెక్టర్ సెక్యూరిటీలను అప్రమత్తం చేయాలని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, సూపరింటెండెంట్లను ఆదేశించారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, గ్రేడ్- 1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రవర్తన బాగా లేకుంటే కఠిన చర్యలు

అనంతపురం అర్బన్: 'జిల్లాలో పలు చోట్ల ప్రిన్సిపాళ్లు, వార్డెన్ల ప్రవర్తన బాగాలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తిస్తే ఉపేక్షించే ప్రసక్తే ఉండదన్నారు. కేజీబీవీల్లో నెలకోసారి బాలికలకు వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. పాఠశాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ హేతుబద్ధంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో 16 సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిని జాగ్రత్తగా పరిష్కరించాలని ఆదేశించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' కపటంపై నిరసనాగ్రహం



చంద్రబాబు ప్రభుత్వ తీరుపై కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీచర్లు

- డిమాండ్ల సాకారానికి 'ఫ్యాప్టో' ధర్నా
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న టీచర్లు

అనంతపురం అర్బన్:కూటమి సర్కారు కపటంపై టీచర్లు నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 'ఫ్యాప్టో' ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ధర్నాకు పీడీ అసోసియేషన్ అమరావతి సంఘాల నాయకులు అక్కులప్ప, పీఎస్‌హెచ్‌ఎం గోవిందరెడ్డి, తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాస్‌నాయక్, సెక్రటరీ జనరల్ పురుషోత్తం, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఇప్పటికీ ఉద్యోగులపై దృష్టి పెట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆత్మగౌరవం దెబ్బతిని అసంతృప్తిలో ఉన్నారని, దీని పర్యవసానాన్ని ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్షణం 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. 11వ పీఆర్‌సీ కాలపరిమితి ముగిసి 21 నెలలైనా 12వ వేతన సవరణ కమిటీపై నూతన ప్రభుత్వం దృష్టి సారించకపోవడం అన్యాయమన్నారు. 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి 11వ పీఆర్‌సీ, డీఏ, సంపాదిత సెలవుల బకాయిలు, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు దాదాపు రూ.30 వేల కోట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికి ప్రభుత్వం రెండు విడతలుగా కేవలం రూ.7,300 కోట్ల బకాయిలను చెల్లించిందన్నారు. మిగిలిన రూ.23 వేల కోట్ల చెల్లింపుపై ప్రభుత్వ కార్యాచరణ ప్రకటించాలన్నారు.

'ఫ్యాప్టో' మరికొన్ని డిమాండ్లు..

- స్థానిక సంస్థల్లో పనిచేస్తూ కోవిడ్ సమయంలో మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలను కలెక్టర్ పూల్ నుంచి చేపట్టాలి.
- కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, పోలీసులకు, ఇతర ఉద్యోగులు దాదాపు 10 వేల మందికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.
- ఉమ్మడి సర్వీస్ రూల్స్ 72, 73, 74 ప్రకారం ఉపాధ్యాయులకు ఎంఈఓలు, డిప్యూటీ డీఓలు, డైట్ లెక్చరర్లగా పదోన్నతి కల్పించాలి.
- ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలల పూర్తి వేతనం ఇవ్వాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులను ఫుల్‌టైం ఉపాధ్యాయులుగా పరిగణించాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగించాలి.

అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను నాయకులు కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కో- చైర్మన్లు ఓబులేసు, లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్లు గోవిందరాజులు, రమణారెడ్డి, వెంకటేష్, కార్యదర్శి రత్నం, కోశాధికారి రెహమాన్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సిరాజుద్దీన్, రామాంజినేయులు, లింగమయ్య, గోపాల్ రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్నకు రుణపడి ఉంటాం



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్/శింగనమల: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐ వింగ్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో అధినేతను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. తనకు అవకాశం ఇచ్చినందుకు పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకితభావంతో పని చేస్తానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ అభిమానులను ఏకతాటిపైకి తీసుకురావడానికి నిబద్ధతతో పని చేస్తానని తెలిపారు.

రీ సర్వే త్వరితగతిన పూర్తి చేస్తాం : కలెక్టర్

అనంతపురం అర్బన్: జిల్లాలో చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రీ సర్వే అంశంపై అదనపు సీసీఎల్ఏ బుధవారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. సమస్యలను క్షేత్రస్థాయిల పరిశీలించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ముగ్గురు ఉత్తమ తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్ఓలను గుర్తించి వారితో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పనులను వారికి అప్పగించి త్వరితగతిన రీసర్వే పూర్తి చేయాలని డీఆర్ఓను ఆదేశించామన్నారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, పరిష్కార వేదిక తహసీల్దారు వాణిశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

- మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన తల్లిదండ్రులు



వన్నూరు స్వామి (ఫైల్)

ఆత్మకూరు/బ్రహ్మసముద్రం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (20) రెండేళ్ల క్రితం ఆత్మకూరు మండలం గొరిదిండ్ల గ్రామానికి చెందిన సి.నారాయణ స్వామి వద్ద గొర్రెల కాపరిగా పనిలో చేరాడు. బుధవారం ఉదయం నిద్ర లేచిన తర్వాత తనతో పాటు ఉన్న వారు అన్నం తీసుకొచ్చేందుకు గ్రామంలోకి వెళ్లారు. ఉదయం 8 గంటల సమయంలో అన్నం తీసుకుని గొర్రెల మందకు చేరుకోగా నారాయణస్వామి కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో నీటి కుంట వద్ద చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న నారాయణ స్వామిని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లిదండ్రులు నాగరాజు, చౌడమ్మకు సమాచారం అందించారు. కాగా, నారాయణస్వామికి ఇంకా పెళ్లి కాలేదు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. తమ కుమారుడు వన్నూరుస్వామి మృతిపై తల్లిదండ్రులు పశువుల నాగరాజు, చౌడమ్మ అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సగౌరవంగా మూల్యాంకనం

గత ప్రభుత్వంలో 'పది' స్పాట్ రెమ్యునరేషన్ పెంపు

- పదేళ్ల తర్వాత పెంచిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు
- నేటి నుంచి 'పది' మూల్యాంకనం



మూల్యాంకనం చేస్తున్న టీచర్లు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబుపత్రాల స్పాట్ (మూల్యాంకనం) విధుల్లో పాల్గొనే అధికారులు, ఉపాధ్యాయులకు దాదాపు పదేళ్లుగా అదే రెమ్యునరేషన్ ఉండేది. ఏడాదికేడాది పెరుగుతున్న సరుకుల ధరలు, ఖర్చులకు ఈ రెమ్యునరేషన్ ఏమాత్రం సరిపోయేదికాదు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎన్నిమార్లు విన్నవించినా లాభం లేకపోయింది. అయితే, ఉపాధ్యాయుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతేడాది రెమ్యునరేషన్ పెంచుతూ నిర్ణయం తీసుకుని అమలు చేసింది. స్పెషల్ అసిస్టెంట్లకు దాదాపు 110 శాతం వరకు పెంచారు. వీరికి అంతకముందు రోజుకు రూ. 137 అందుతుండగా, గతేడాది రూ. 300కు పెంచారు. జవాబు పత్రాలు దిద్దే ఏఈ (అసిస్టెంట్ ఎగ్జామినర్)లకు ఒక్కో పేపరుకు రూ.6.60 నుంచి రూ.10కు పెంచారు.

పెంపు ఇలా..

చీఫ్ ఎగ్జామినర్లకు (సీఈ) గతంలో రోజుకు రూ. 264 ఇస్తుండేవారు. దీన్ని రూ. 396కు పెంచారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లకు (ఏసీఓ వాల్యుయేషన్) రూ. 286 నుంచి రూ. 429కు పెంచారు. ఏసీఓ (కోడింగ్)లకు రూ. 198 నుంచి రూ. 297కు, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లకు (డీసీఓ) రూ. 330 నుంచి రూ. 495కు, క్యాంపు ఆఫీసర్‌కు (సీఓ) రూ. 385 నుంచి రూ. 578కు పెంచారు.

నేటి నుంచి 'స్పాట్'..

ఈ ఏడాదికి సంబంధించి గురువారం నుంచి స్పాట్ ప్రారంభం కానుంది. నగరంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం డీఈఓ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. సోషల్ మినహా తక్కిన అన్ని సబ్జెక్టుల జవాబుపత్రాలు వచ్చాయి. మొత్తం మీద 3 లక్షల వరకు వస్తాయని తెలిసింది.

ఏళ్ల డిమాండ్‌ను నెరవేర్చారు



పదో తరగతి మూల్యాంకనం రేట్లు పెంచాలని అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయ సంఘాలు చేసిన డిమాండ్‌ను గతేడాది ప్రభుత్వం నెరవేర్చింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి మూల్యాంకనానికి హాజరవుతారు. వారం రోజులపాటు అనంతపురంలో ఉండాల్సి వస్తుంది. అలాంటి వారికి జిల్లా విద్యాశాఖ ఎలాంటి వసతి, భోజన సదుపాయం కల్పించడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని భోజన, వసతి కల్పించాలి.

– వి. గోవిందరాజులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మరింత పెంచాలి



పదో తరగతి పరీక్షల నిర్వహణ, జవాబుపత్రాల మూల్యంకన విధుల నిర్వర్తించే సిబ్బందికి రెమ్యునరేషన్ దాదాపు పదేళ్ల తర్వాత గతేడాది పెంచడం చాలా సంతోషం. అంతకముందు అన్ని హోదాల సిబ్బందికి చాలా నామినల్‌గా రెమ్యునరేషన్ చెల్లించేవారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం రెమ్యునరేషన్ మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలి.

– డెగావత్ రవీంద్రనాథ్
గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సంతోషం కలిగించింది



పదో తరగతి మూల్యాంకనం విధులకు హాజరయ్యే ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు చాలా తక్కువమొత్తంలో రెమ్యునరేషన్ చెల్లించేవారు. గతేడాది ప్రభుత్వం ఆశాజనకంగా పెంచుతూ చర్యలు తీసుకోవడం చాలా సంతోషమేసింది. కష్టపడి పని చేస్తున్నా ఆశించిన స్థాయిలో రెమ్యునరేషన్ ఇవ్వక పోవడంతో టీచర్లు చాలా అసంతృప్తిగా ఉండేవారు. స్పెషల్ అసిస్టెంట్లకు డీఏ సదుపాయం కల్పించాలి.

– కె.గోవిందరెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

జిరసం అధ్యక్షుడిగా 'కొత్తపల్లి'



అనంతపురం కల్చరల్: జిల్లా రచయితల సంఘం (జిరసం) నూతన కార్యవర్గాన్ని స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, సీనియర్ కవి డాక్టర్ రాధేయ, ఉప్పరపాటి వేంకటేశుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ జెన్నె ఆనంద్ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వర్ధమాన కవి కొత్తపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా వన్నప్ప, కోశాధికారిగా మధురశ్రీను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సీనియర్ రచయితలు అభినందించారు. కార్యక్రమంలో జిరసం ప్రతినిధులు విద్యావతి, గోసల నారాయణస్వామి, ఎల్ఆర్ వెంకటరమణ, డాక్టర్ అంకె శ్రీనివాస్, చేగువేరా హరి, ఒంటెద్దు రామలింగారెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

89 మంది కానిస్టేబుళ్ల బదిలీ

అనంతపురం: సీనియార్టీ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి 89 మంది కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో చేపట్టిన ఈ ప్రక్రియను అడిషనల్ డీఎస్పీ డీవీ రమణమూర్తి, ఏఓ రవిరాం నాయక్ తదితరులు పర్యవేక్షించారు. ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బంది జాబితాను సిద్ధం చేసి కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు.

దౌర్జన్యాలు సహించం

- తిట్టినందుకే దుర్మార్గుడినైతే వందలాది మందిని పొట్టనబెట్టుకున్న పరిటాల రవి దేవుడా?
- మారణకాండను ఆపేందుకు అవసరమైతే ప్రాణత్యాగానికి సిద్ధం
- 8న రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వైఎస్ జగన్ రాక
- వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి చందు

అనంతపురం ఎడ్యుకేషన్: దౌర్జన్యాలతో పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించబోమని ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారులు, సోదరులు, బంధువులను వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే, వారి బంధువుల దౌర్జన్యాలు పెచ్చుమీరాయని మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిటాల సునీత బంధువుల చేతిలో హత్యకు గురైన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారన్నారు. ప్రజాస్వామ్యవాదులు, శాంతికాముకులు, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోలీసులకు విస్తృత స్వేచ్ఛ ఉండేదన్నారు. ఏ చిన్నదాడి జరిగినా మన.. తమ అనే భేదభావాలు లేకుండా కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. దీంతో రాప్తాడు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారులు, సోదరులు, బంధువులు హత్యారాజకీయాలకు పాల్పడుతున్నారని, ఫలితంగా నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం మటుమాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తాను చంద్రబాబును ఉద్దేశించి మాట్లాడిన మాటలను తరచూ గుర్తు చేస్తున్నారని, అయితే తనను రెచ్చగొట్టేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేయడంతోనే తాను ఆయనపై విమర్శలు చేయాల్సి వచ్చిందన్నారు. 'చంద్రబాబు, లోకేష్... మీకు బాధ కలిగి ఉంటే క్షమించాలని ఆ రోజే చెప్పా...ఈ రోజు కూడా క్షమించమని చెబుతున్నా. తిట్టినందుకే నేను దుర్మార్గుడిని అయితే వందలాది మందిని హతమార్చిన నీ భర్త (పరిటాల రవి) దేవుడా?... చెప్పు సునీతమ్మా' అంటూ ప్రశ్నించారు. పరిటాల వర్గీయులు సాగిస్తున్న దుర్మార్గాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలుగా తాము సమిధలయ్యేందుకు కూడ సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో అనంతపురం రూరల్, రాప్తాడు ఎంపీపీలు వరలక్ష్మి, జయలక్ష్మి,, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందరెడ్డి, బండి పవన్, రాప్తాడు సత్తిరెడ్డి, మామిళపల్లి హరినాథ్‌రెడ్డి, బాలపోతన్న, నాగముని, తిరుపాల్‌రెడ్డి, భానుకోట శివ పాల్గొన్నారు.

96.7 శాతంతో సరి

- లక్ష్యానికి చేరువగా వచ్చి ఆగిపోయిన మార్కెటింగ్‌శాఖ



అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశిత లక్ష్యానికి చేరువగా మార్కెటింగ్‌శాఖ వచ్చి ఆగిపోయింది. మార్చి నెలాఖరుతో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా రూ.12.06 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా... 96.7 శాతంతో రూ.11.66 కోట్లు సాధించినట్లు ఆ శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి బుధవారం వెల్లడించారు. ఇందులో రాయదుర్గం మార్కెట్‌యార్డు రూ.1.44 కోట్లకు గాను 112 శాతంతో రూ.1.61 కోట్లకు పైగా సాధించి మొదటి స్థానంలో నిలిచింది. కళ్యాణదుర్గం 105 శాతం, శింగనమల, తాడిపత్రి 103 శాతం, గుంతకల్లు 102 శాతం సాధించి లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఇక అనంతపురం మార్కెట్‌యార్డు లక్ష్యం రూ.4.60 కోట్లు కాగా, 94 శాతంతో రూ.4.27 కోట్లకు పైగా వసూలు చేసి లక్ష్యానికి చేరువగా నిలిచిపోయింది. మిగిలిన వాటిలో ఉరవకొండ 84 శాతం, గుత్తి 90 శాతం కాగా ఆఖరి స్థానంలో రాప్తాడు మార్కెట్ కమిటీ 44 శాతంతో లక్ష్యానికి ఆమడదూరంలో ఆగిపోయింది. ఈ క్రమంలో ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా మార్కెటింగ్‌శాఖకు రూ.13.93 కోట్లు లక్ష్య నిర్దేశన చేసినట్లు ఏడీఎం తెలిపారు. ఇందులో అత్యధికంగా అనంతపురం మార్కెట్ కమిటీకి రూ.5.25 కోట్లు టార్గెట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 98.2 శాతం:

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5.31 కోట్లు లక్ష్యం ఇవ్వగా రూ.5.22 కోట్లు వరకు వసూలు చేసి 98.2 శాతం ప్రగతి సాధించినట్లు ఏడీఎం ఎల్ఎస్ మూర్తి తెలిపారు. ఇందులో పెనుకొండ మార్కెట్‌యార్డు 162 శాతంతో మొదటి స్థానంలో ఉండగా... తనకల్లు 132 శాతం, కదిరి 106 శాతం, గోరంట్ల 102 శాతం, పుట్టపర్తి 100 శాతం వసూళ్లతో లక్ష్యాన్ని చేరుకున్నాయి. హిందూపురం 93 శాతం, మడకశిర 91 శాతం, ధర్మవరం మార్కెట్‌యార్డు 76 శాతం వసూళ్లతో లక్ష్య సాధనలో వెనుకబడ్డాయి. కాగా, ఏప్రిల్ నుంచి మొదలైన 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీసత్యసాయి జిల్లా మార్కెటింగ్‌శాఖకు రూ.5.86 కోట్ల వసూళ్ల లక్ష్యంగా నిర్దేశించినట్లు ఏడీఎం తెలిపారు.

వివాహిత బలవన్మరణం

బొమ్మనహాళ్: మండలంలోని లింగదహాళ్ గ్రామానికి చెందిన వివాహిత బోయ అనంతమ్మ (38) ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. దాదాపు 15 ఏళ్లుగా అనంతమ్మ ఫిట్స్‌తో బాధపడుతోంది. ఈ క్రమంలో చికిత్స చేయించిన ఫలితం దక్కలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రసాయనిక గుళికలు మిగింది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు గమనించి ఆమెను వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త వన్నూరు స్వామి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'చేతి వాటం'పై కలెక్టర్ సీరియస్

- విచారించి నివేదిక ఇవ్వాలంటూ డీఈఓకు ఆదేశం
- 'సాక్షి' కథనంతో జాడలేకుండా పోయిన డీఈఓ కార్యాలయ కలెక్షన్ కింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో ఆడిట్ అధికారుల 'చేతి'వాటంపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడిట్ అంశానికి సంబంధించి ఎమ్మార్సీలు, ఉన్నత పాఠశాలలకు ఓ ధర చొప్పున నిర్ణయించి వసూళ్లకు తెర తీసిన అంశంపై 'విద్యాశాఖ ఆడిట్‌లో 'చేతి'వాటం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్పందించి విచారించి నివేదిక ఇవ్వాలంటూ డీఈఓ ప్రసాద్‌బాబును ఆదేశించారు. కాగా, మొన్నటి వరకూ కేవలం నాలుగైదు పేపర్లు, ఓ ఐదు ఎస్ఆర్‌లు తీసుకొచ్చినా తూతూమంత్రంగా పరిశీలించి 'ఓకే' చేసిన ఆడిట్ అధికారులు బుధవారం మాత్రం స్కూళ్లలో పని చేస్తున్న టీచర్లందరి ఎస్ఆర్‌లు, నిధుల ఖర్చుకు సంబంధించి బిల్లులు తెప్పించి పరిశీలించారంటూ హెచ్ఎంలు తెలిపారు. అలాగే ఇన్ని రోజులూ కలెక్షన్ కింగ్ అవతారమెత్తి ఆడిట్ కోసం వస్తున్న ఎంఈఓలు, హెచ్ఎంలతో మామూళ్లు వసూలు చేసిన విద్యాశాఖ ఉద్యోగి జాడ బుధవారం లేకుండా పోయింది. కలెక్షన్ కింగ్ నిర్వాకంపై జోరుగా చర్చ జరిగింది. అలాగే ఆడిట్ కోసం వచ్చిన ప్రత్యేక అధికారులకు వచ్చిన రోజు నుంచి భోజనాలు, వసతి ఖర్చంతా డీఈఓ కార్యాలయంలోని ఓ అధికారే భరిస్తున్నట్లు సమాచారం. రోజూ రూ. 4 వేల నుంచి రూ.5 వేలకు పైగా సదరు ఉద్యోగి ఖర్చు చేస్తున్నట్లుగా తెలిసింది.

లోగుట్టు 'శ్రీవారి'కే ఎరుక!

- రాయదుర్గంలోని ప్రసన్న వేంకటరమణ స్వామి మూలవిరాట్ కదలికపై సర్వత్రా చర్చ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాయదుర్గంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి మూలవిరాట్‌ను కదిలించినట్లుగా వదంతులు వ్యాపించాయి. దాదాపు 400 ఏళ్ల క్రితం కోదండరామాచార్యులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. తిరుమల ఆలయ విశిష్టతలకు దగ్గరి పోలికలతో ఉన్న ఈ ఆలయ గోపురం 40 అడుగుల ఎత్తుతో ఐదు అంతస్తులతో నిర్మించారు. శ్రీవారిని ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తమ ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు. ఏటా సంప్రదాయ రీతిలో కల్యాణోత్సవాలు, రథోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇంతటి విశిష్ట కలిగిన ఆలయంలో మూలవిరాట్ కదలికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏది వాస్తవం?

శ్రీదేవి, భూదేవి సమేతంగా పీఠంపై కొలువుదీరిన ప్రసన్న వేంకటరమణస్వామి మూలవిరాట్ పూజా సమయంలో కదులుతున్నట్లుగా అర్చకులు గుర్తించారు. విగ్రహాలను అలంకరణ చేస్తున్న సమయంలో కిందకు ఒరిగే ప్రమాదముందని నిర్ధారించుకున్న అర్చకులు విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో శాస్త్రబద్ధంగా అష్టదిగ్బంధం చేశాక దేవదాయ శాఖ కమిషనర్/అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన అధికారి పర్యవేక్షణతో పాటు భక్తుల సమక్షంలో వాటిని సరిదిద్దాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా విగ్రహాలు కదిలించి సిమెంటు, సీసం పోశారన్న ప్రచారం జరుగుతోంది. ఆ సమయంలో బయటి వ్యక్తులు గర్భగుడిలోకి ప్రవేశించి ఆలయ ప్రతిష్టకు అపవిత్రత చేకూర్చారనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఆలయ అర్చకులు, అధికారులను నిలదీస్తున్నారు. సంప్రదాయనికి తూట్లు పొడిచే అధికారం ఎవరిచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా అంతా అసత్య ప్రచారమేనని అధికారులు కొట్టిపడేస్తున్నారు. ఈ క్రమంలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా సీసీ పుటేజీలను బహిర్గతం చేయాలనే డిమాండ్ రోజు రోజుకూ విస్తృతమవుతోంది.

దుష్ప్రచారం సరికాదు

మూలవిరాట్‌లు కదిలించారంటూ గత పది రోజులుగా రకరకాల ప్రచారం జరుగుతోంది. ఇందులో వాస్తవం కంటే అవాస్తవాలే ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. దేవదేవుడి ప్రతిష్టకు భంగం కలిగించే సాహసం చేయడం ఎవరి వల్లనూ కాదు. అయితే మూలవిరాట్‌లు ఊగిసలాడుతుండడంతో అష్టదిగ్బంధం చేసి చుట్టూ సీసం పోయాల్సి వచ్చింది. అంతేకానీ పక్కకు జరిపారన్నది పూర్తిగా అవాస్తవం.

– నరసింహారెడ్డి, ఈఓ, రాయదుర్గం

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంతకల్లు: స్థానిక మద్దికెర రైలు మార్గంలోని పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. రన్నింగ్ రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందకు పడి మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. మృతుడికి దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, ఛామని చాయ రంగు, తెల్లరంగు నీలం పూల చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించాడని వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98661 44416కు సమాచారం అందించాలని కోరారు.

వైభవంగా సిడిమాను ఉత్సవం

రాయదుర్గం టౌన్: స్థానిక రససిద్ధుల కొండపై వెలసిన రససిద్ధేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం సిడిమాను ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు సిడిమానుకు బాలుడిని కట్టి తిప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయ సీనియర్ అకౌంటెంట్ ఈశ్వర్ స్నేహబృందం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



స్వామి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు



రససిద్ధుల కొండపై అశేష భకుల మధ్య సిడిమానుకు బాలుణ్ని కట్టి తిప్పుతున్న దృశ్యం

దాయాదుల ఘర్షణ - ఇద్దరికి గాయాలు



కళ్యాణదుర్గంలో ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలం మాలేపల్లిలో ఆస్తి విషయంగా దాయాదుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... మాలేపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు రామాంజనేయులుకు ఇద్దరు భార్యలున్నారు. ఆస్తి విషయంగా బుధవారం రాత్రి రామాంజనేయులుతో పెద్ద భార్య హనుమక్క, కుమారుడు హనుమంతరాయుడు, అల్లుడు గోపి, మర్రిస్వామి, నాగార్జున నవీన్, కుర్లపల్లి బంధువులు హనుమంతరాయుడు, కోనేరు గొడవ పడ్డారు. ఆ సమయంలో పెద్ద భార్య బంధువులు రామాంజనేయులు, ఆయన చిన్నభార్య ఈశ్వరమ్మపై దాడి చేయడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఘటనపై శెట్టూరు పోలీసు స్టేషన్లో ఇరువర్గాలూ ఫిర్యాదు చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షుడు ఉద్దీప్‌సింహా, రూరల్ అధ్యక్షుడు మల్లాపురం దొణస్వామి, ప్రతినిధులు నాగరాజు, ఖాజా, రఘుతో పాటు పలువురు రామాంజనేయులుకు బుధవారం రాత్రి కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. కుటుంబ ఆస్తి విషయంలో టీడీపీ నేతలు జోక్యం చేసుకుని, దాడులకు ప్రేరేపించడం సరికాదని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ యువరాజు సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. సమస్యకు పరిష్కారం చూపుతానని భరోసా నివ్వడంతో ఆందోళనను విరమించారు.

క్లుప్తంగా

సేవలు చిరస్మరణీయం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సన్మానించిన ఎస్పీ జగదీష్

అనంతపురం: ఉద్యోగ విరమణ అనివార్యం అయినప్పటికీ, సేవలు చిరస్మరణీయమని ఎస్పీ జగదీష్ అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐలు భాస్కర్, మహమ్మద్ వలీ , గుంతకల్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రను సన్మానించారు. ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సూర్యప్రతాప్‌రెడ్డి (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌కు చెందిన సూర్యప్రతాప్‌రెడ్డి రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. కట్టకిందపల్లికి చెందిన సూర్యప్రతాప్‌రెడ్డి సిండికేట్‌నగర్‌లో స్థిరపడ్డాడు. ఓ మెడికల్ స్టోర్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ట్యూషన్‌కు వెళ్లిన పిల్లలను పిలుచుకొస్తానని ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ చేశాడు. బుధవారం భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలాఉండగా సూర్యప్రతాప్‌రెడ్డికి ఆర్థిక సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఎక్కువచోట్ల అప్పులు చేసిన కారణంగా రుణదాతలకు చెప్పుకోలేక అదృశ్యమైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉట్లమాను ఉత్సవ సమితి నూతన కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి పండుగ రోజుల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచే ఉట్లమాను ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. బుధవారం వడ్డే మిత్రబృందం ఆధ్వర్యంలో నగరంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. కమిటీ ప్రెసిడెంట్‌గా వెంకటేశులు, సభ్యులుగా శ్రీనివాసులు, రమేష్, పుల్లన్న, రాము, సత్యమయ్య, బాలరాజు, చంద్రశేఖర్, వెంకటరాముడు, ప్రకాష్, వెంకటేశులు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని మూడవ రోడ్డు జీఆర్ ఫంక్షన్ హాలు సర్కిల్‌లో 46 ఏళ్లగా ఉట్ల పరుషను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 6న ఉట్లమాను ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సత్కరించారు.

దివ్యాంగురాలికి అంత్యక్రియలు



లక్ష్మీదేవి మృతదేహాన్ని తీసుకెళ్తున్న సాయి ట్రస్ట్ సభ్యులు

రాప్తాడు: మండలంలోని కళాకారుల కాలనీకి చెందిన దివ్యాంగురాలు తిరుమలప్ప గారి లక్ష్మీదేవికి అంత్యక్రియలు చేసి, మానవత్వం చాటుకున్నారు సాయి ట్రస్ట్ సభ్యులు. వివరాలు.. తిరుమలప్ప గారి లక్ష్మీదేవికి ఈనెల 1వ తేదీ వైరల్ ఫీవర్ వచ్చింది. రక్తకణాల సంఖ్య తగ్గడంతో అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజూ సాయంత్రం మృతి చెందింది. ఆమె భర్త తిమ్మారెడ్డి కూడా దివ్యాంగుడే. ఆమె మృతదేహాన్ని వారి బంధువు శ్రీనివాస రెడ్డి సహాయంతో ఇంటికి తీసుకెళ్లారు. జనవరి 1వ తేదీ మంగళవారం కావడంతో ఆమె అంత్యక్రియలకు బంధువులు ఎవరూ రాలేదు. విషయం తెలుసుకున్న సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్ స్పందించారు. లక్ష్మీదేవి మృతదేహాన్ని గుత్తి రోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌కు తీసుకెళ్లి అక్కడ అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సాయి ట్రస్ట్ సభ్యులు నారాయణ నాయక్, మహేశ్, కోటేశ్వర రావు, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత కొరవడి.. కంకర తేలి

నగరంలో ఇష్టారాజ్యంగా ప్యాచ్ వర్కులు

- అప్పుడే ధ్వంసమైన రోడ్లు
- బిల్లుల చెల్లింపులో తమ్ముళ్లకు సహకరించిన అధికారులు!
- వృథా అవుతున్న ప్రజాధనం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సీసీ బిల్లుల పేరుతో జరుగుతున్న అక్రమాలు మరువక ముందే మరో అడ్డగోలు వ్యవహారం వెలుగు చూసింది. కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్ల ప్రమేయంతో ఇష్టారాజ్యంగా పనులు చేయడంతో పాటు బిల్లులను వేగవంతంగా చేసుకోవడం పెద్ద చర్చనీయాంశమైంది. నగరపాలక సంస్థలోని ఓ ఈఈ, ఓ అకౌంటెంట్ కుమ్మక్కై కాంట్రాక్టర్‌కు పరోక్షంగా సహకరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.లక్షల ప్రజాధనం ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నాణ్యత సరిగా లేని వాటిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

పైపై పూతలు.. తేలిన కంకర

నగరంలోని వివిధ డివిజన్లలోని విద్యుత్ నగర్, సాయినగర్, హౌసింగ్ బోర్డు, ఆర్ఎఫ్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్ రోడ్డు, నీలిమా థియేటర్, రాంనగర్, పాతవూరు, 1, 2, 3, 4, 5 రోడ్లు, గౌరవ గార్డెన్, సోమనాథ్ నగర్, రంగస్వామి నగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఈ ఏడాది జనవరిలో టెండర్లు ఆహ్వానించారు. రూ.47 లక్షలతో 275 రోడ్లు వేయాలని నిర్ణయించారు. కాగా సదరు కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పనులు చేస్తున్నట్లు గతంలో సాక్షిలో కథనాలు ప్రచురితమైనా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం నగరంలో చేపట్టిన పనులు అప్పుడే నాణ్యత లోపించాయి. కంకర తేలి మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. గుంతలుండే చోట కంకర పైకి రావడంతో.. ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. వాహనాల్లో వెళ్లే సమయంలో రాళ్లు ఇతరులపై పడే అవకాశం లేకపోలేదు. దీంతో పాటుగా యువత బైక్ వెళ్లే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

నిద్రమత్తులో ఇంజినీర్లు

కూటమి ప్రభుత్వంలో ఇంజినీర్లు పత్తా లేకుండా పోయారు. రూ.40 కోట్ల అభివృద్ధి పనులు ప్రశ్నార్థకంగా మారాయి. ఇటువంటి తరుణంలో నగరపాలక సంస్థలో ఎస్ఈ, ఈఈలు, డీఈలు, ఏఈలు ఆయారాం గయారాం అన్న చందంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు నగరంలోని 74 సచివాలయాల పరిధిలో 65 మందికిపైగా ఎమినీటీ కార్యదర్శులు ఉన్నారు. వాస్తవంగా గడిచిన 10 నెలల్లో జరిగిన పని ఏదైనా ఉందంటే అది ప్యాచ్ వర్క్. అందులోనూ పూర్తి స్థాయిలో ప్యాచ్ వర్క్ పనులు చేపట్టలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించలేదు.





సోమనాథ్ నగర్, రజక్‌నగర్‌లో అప్పుడే దెబ్బతిన్న ప్యాచ్ వర్కులు, అసౌకర్యంగా వెళ్తున్న ప్రయాణికులు

క్వాలిటీ కంట్రోల్ నివేదిక అంతా తూచ్

వాస్తవంగా నగరపాలక సంస్థలో జరిగే ప్రతి పనికి క్వాలిటీ కంట్రోల్ నివేదిక ఉండాలి. కాగా ఈ పనులకు సంబంధించి కొన్నింటికి మాత్రమే క్వాలిటీ కంట్రోల్ నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇది వరకే ప్యాచ్ పడ్డ వాటికి ఏవిధంగా నాణ్యత చెక్ చేస్తారని క్వాలిటీ కంట్రోల్ థర్డ్ పార్టీ ఏజెన్సీ చెప్పడం వివాదాస్పదంగా మారింది. కేవలం క్షేత్రస్థాయిలో పర్యటించి క్వాలిటీ కంట్రోల్ నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది.

ఇద్దరు సిబ్బంది కనుసన్నల్లో..

ప్యాచ్ వర్క్‌లకు సంబంధించి రూ.20 లక్షల బిల్లులు ఇచ్చినట్లు సమాచారం. నగరపాలక సంస్థలోని ఓ ఈఈ, అకౌంట్స్ విభాగంలోని కీలక అధికారి ప్రమేయంతో గుట్టుచప్పుడు కాకుండా బిల్లును సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపేశారు. తెలుగు తమ్ముళ్ల సిఫార్సులతో తొలి దశ మొత్తాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా అకౌంట్స్ విభాగంలో ఓ కీలక అధికారి ఇది వరకే టెండర్ లేకుండా చేసిన పనులకు రూ.20 లక్షల బిల్లులు కూడా చేసేశారు. సదరు అధికారిపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లతో నేరుగా కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు సదరు అధికారిపై లోతుగా విచారణ చేస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయి.

కొన్ని రోజులకే తేలిపోయింది



కొన్ని నెలలుగా రజక్ నగర్, సోమనాథ్ నగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గుంతలు కనిపించేవి. ఈ ఏడాది జనవరిలో మునిసిపల్ అధికారులు వచ్చి రోడ్లను పరిశీలించారు. రోడ్లు వేస్తారని అనుకున్నాం.. గుంతలు తవ్వి వదిలేశారు. నెల రోజుల పాటు కంకర అలాగే వదిలేశారు. అప్పుడు ఇబ్బందులు పడ్డాం. అలస్యంగా పనులు చేసిన కొన్ని రోజులకే కంకర తేలిపోయింది. ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రోడ్లు మరీ ఇంత దారుణంగా ఉంటే ఎలా సార్?

– రామాంజనేయులు, రజక్‌నగర్

ప్రమాదాలు జరుగుతున్నాయి



నగరంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడా చూసినా గుంతలు కనిపిస్తున్నాయి. రోడ్లపైకి వెళ్లాలంటే భయమేస్తోంది. సోమనాథ్ నగర్‌లో గుంతలు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త రోడ్లు వేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– నరేంద్ర, సోమనాథ్‌నగర్

ఫొటోగ్రాఫర్ల కృషి అభినందనీయం

అనంతపురం కల్చరల్: సమాజంలో నిత్యం ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి ఫొటో, వీడియో గ్రాఫర్లు చేస్తున్న కృషి అభినందనీయమని మునిసిపల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్ కొనియాడారు. బుధవారం టవర్‌క్లాక్ సమీపంలో డాగురె ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మోహన రెడ్డి, అనంత వాటర్ ప్లాంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ్మోహన్, అసోసియేషన్ గౌరవ సలహాదారుడు గణేష్ నాయుడు, ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి, కార్యదర్శి అమరనాథరెడ్డి, సహకార్యదర్శి కృష్ణారెడ్డి, ట్రెజరర్ హనీఫ్, రూరల్ ప్రాంత కార్యదర్శులు రంగా,నాగరాజు, సీనియర్ ఫొటోగ్రాఫర్ నరసింహులు, తిరుమల వెంకటేశులు, రాము, సుధాకర్, పవన్, గోపాలరెడ్డి, రామకృష్ణారెడ్డి, శివ, బాబా ఫకృద్దీన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పన్ను వసూళ్లు అధ్వానం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'నీటి పన్ను వసూళ్లు అధ్వానంగా ఉన్నాయి. నీటి పన్ను వసూలు డిమాండ్ రూ.12.25 కోట్లు ఉంటే.. మీరు వసూలు చేసింది. రూ.10 వేలు. ఇదేనా మీ పనితీరు... ఇలాగేనా పని చేసింది.' అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోలతో కలిసి రెవెన్యూ సెక్టార్, రీసర్వే, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి పన్ను వసూళ్ల విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. డిమాండ్ మేరకు వసూళ్లు జరగాలన్నారు. రీసర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. రోజుకు 5 వేల హద్దు రాళ్లు నాటాలని ఆదేశించారు. రీ సర్వే రెండవ దశకు సంబంధించి నివేదిక అందించాలన్నారు. పరిష్కార వేదికలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని తెలిపారు. 22ఏ, చుక్కల భూములు, భూమి అప్పగింత, అసైన్మెంట్ భూమి, ఇనాములు, ఎస్టేట్లు, ఆర్ఓఆర్, వెబ్‌ల్యాండ్, రీసర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, పీజీఆర్ఎస్ తహసీల్దారు వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న పెన్నోబులేసు దంపతులు



జిల్లా అధ్యక్షుడు అనంతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పెన్నోబులేసు తదితరులు బుధవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అనంతను గజమాలతో సన్మానించారు. అలాగే ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎగ్గుల శ్రీనివాసులు తదితరులు అనంతను సన్మానించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అధిష్టానం ఇచ్చిన పదవికి న్యాయం చేసేలా..సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు మాట్లాడుతూ.. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత నాయకత్వంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్టీసీ రీజినల్ బోర్డు మాజీ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు మల్లెమీద నరసింహులు, చింతా సోమశేఖర్ రెడ్డి, సైపుల్లాబేగ్, నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, చామలూరు రాజగోపాల్, చింతకుంట మధు, కేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై దాడులు దుర్మార్గం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఆత్మకూరు: బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పరిటాల సునీత.. నేడు అధికారం, పోలీసులను అడ్డం పెట్టుకుని బీసీలపై దాడులు చేయిస్తున్నారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో పరిటాల కుటుంబం రాజకీయ లబ్ధి కోసం బీసీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి బీసీలు, బడుగు బలహీన వర్గాల ప్రజల మద్దతు ఎక్కువగా ఉందన్నారు. ఇది ఓర్వలేని టీడీపీ నేతలు బీసీలను టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. ఇటీవల రామగిరి మండం పాపిరెడ్డి పల్లెలో లింగమయ్యను ఇనుప రాడ్లు, కట్టెలతో కొట్టి హత్య చేశారని పేర్కొన్నారు. సిద్దరాంపురం గ్రామంలో కురుబ బాలన్నను విచక్షణ రహితంగా కట్టెలతో కొట్టి దాడి చేశారని గుర్తు చేశారు. ఇటీవల అనంతపురం రూరల్ మండలంలో ఇళ్ల కూల్చివేతలో భాగంగా బాధితుల పక్షాన నిలిచిన జడ్డి కురుబ కిష్టప్పను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద కురుబ నాగిరెడ్డిపై దాడి చేశారని తెలిపారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా బీసీలపై దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గం ప్రశాంతంగా ఉందన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేరూరు డ్యాంకు నీరు తెప్పించి వ్యవసాయన్ని పండుగ చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న, ఎంపీపీ సుబ్బర హేమలత, మాజీ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గౌరవ రాజశేఖర్, చిట్రా ఓబయ్య, బిల్లే గోపాల్, మజ్జిగ హనుమంతు, సనప శీనప్ప, మల్లయ్య, మజ్జిగ రాజగోపాల్, గౌరవ మధు, పిల్లల మారుతి, పిల్లల ఎర్రిస్వామి, సుబ్బర మారుతి, సుబ్బర గంగాధర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలతో గుర్తింపు

అనంతపురం మెడికల్: ల్యాబ్ టెక్నీషియన్లు అంకిత భావంతో పని చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తించే ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. రోగి వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే 63 పరీక్షలను నాణ్యతగా చేపట్టాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీఐఓ ఓబులు, ల్యాబ్ టెక్నీషియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

అనంతపురం మెడికల్: ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో ఆటిజం లక్షణాలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి ఆటిజం వ్యాధి లక్షణాలు, పిల్లల్లో కన్పించే సమస్యలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో క్లినికల్, చైల్డ్ సైకాలజిస్టు డాక్టర్ సుందర రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు



ర్యాలీ చేపట్టిన ముస్లింలు

అనంతపురం కల్చరల్: ముస్లిం, మైనార్టీలను నమ్మించి మోసం చేసిన చంద్రబాబును ముస్లిం సమాజం ఎప్పటికి మరవదని పలు పార్టీల ముస్లిం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం సాయంత్రం యుజేఏసీ (యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో నిరసనతెలిపారు. సప్తగిరి సర్కిల్ నుంచి నినాదాలు చేస్తూ మైనార్టీల సంఘీభావంగా మానవ హారం ఏర్పాటు చేశారు. మేయర్ వసీం, మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఉర్దూ అకాడమీ మాజీ అధ్యక్షుడు నదీం, ఏకేఎస్ ఫయాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు దాదాగాంధీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు జాఫర్, గోల్డ్ బాషా మాట్లాడారు. ముస్లింలకు అండగా ఉంటామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిస్సిగ్గుగా స్వార్థపూరిత ఆలోచనలతో బిల్లుకు మద్దతు ఇవ్వడం తగదని హెచ్చరించారు. వక్ఫ్ బోర్డు భూములంటే స్వచ్ఛందంగా దానధర్మమిచ్చినవని.. వెనక్కు లాక్కొనే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. వక్ఫ్‌బోర్డు భూములను తేల్చే కమిటీల్లో ముస్లిమేతరులకు స్థానం కల్పించడం దుర్మార్గమని మండిపడ్డారు. అలాగే ఇతర మతాల విషయంలో ముస్లింలకు అవకాశం కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. బిల్లును వెనక్కు తీసుకునే వరకు ఉద్యమం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, ఐఎంఎం బాషా, సీపీఐ నారాయణ స్వామి, ఇమామ్, జిలాన్, వలి, అల్లిపీరా, లింగమయ్య, రమణ, బాబా సాహెబ్, ఖమర్‌తాజ్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

అనంతపురం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులపై సవతి ప్రేమ చూపుతోందని నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు మండిపడ్డారు. బుధవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో పలు సమస్యలపై ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా చైర్మన్ సూరిబాబు మాట్లాడుతూ..1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని కోరారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫలితంగా చాలా మంది ఉద్యోగులు సీనియారిటీ ఉండి కూడా పదోన్నతుల ఫలాలను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈహెచ్ఎస్ స్థానంలో ప్రభుత్వం పాత వైద్య విధానాన్ని తీసుకురావాలని సూచించారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించక పోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు.

నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

అనంతపురం కార్పొరేషన్: వేసవిలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్ఈ చంద్రశేఖర్‌కు కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. బుధవారం నగరంలోని ఆసార్ వీధి, మున్నానగర్, పాతూరులో ఉన్న పవర్ బోర్స్, హ్యాండ్ బోర్స్‌ను పరిశీలించారు. నగరంలో మొత్తం 199 పవర్ బోర్స్ ఉన్నాయని ఎస్ఈ చంద్రశేఖర్ తెలిపారు. అందులో 185 రన్నింగ్‌లో ఉన్నాయన్నారు. హ్యాండ్ బోర్స్ 224 ఉండగా.. 214 రన్నింగ్‌లో ఉన్నాయని కమిషనర్‌కు వివరించారు. మరమ్మతుకు నోచుకోని బోర్లను రిపేరీ చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, ఏఈ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న సీతారాముల కల్యాణం

అనంతపురం కల్చరల్: జీసెస్ నగర్, విద్యుత్ కాలనీలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 6న సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మోహనరావు, ప్రధాన అర్చకుడు రఘోత్తమ ఆచార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రెవెన్యూ కాలనీలో ఉన్న రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను మూడు రోజుల పాటూ నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి రాజశేఖరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ నిర్విరామ శ్రీరామనామ జపం జరుగుతుంది. 5న శ్రీరామ తారకజపం, సామూహిక హోమాలు, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరగనున్నాయి. 6న కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: మహిళలకు రక్షణ కల్పించాలని దళిత, గిరిజన ప్రజా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాకెట్ల చందునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డీజీపీ సంఘం కార్యలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో మహిళపై గ్యాంగ్ రేప్ జరిగిందని తెలిపారు. కామాంధులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీజీపీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జలాలపురం పోతలయ్య పాల్గొన్నారు.

ఘనంగా సల్లాపురమ్మ పార్వేట



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

రాప్తాడు: ఎం.బండమీదపల్లిలో సల్లాపురమ్మ జాతరలో భాగంగా బుధవారం పార్వేట నిర్వహించారు. ఉదయం సల్లాపురమ్మ దేవతను గ్రామంలోకి తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. యువతులు, మహిళలు బోనాలను తలపై పెట్టుకుని డప్పు, వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. గ్రామాన్ని చల్లగా చూడాలంటూ బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి చీరలను కానుకలుగా సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారికి మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను బలి ఇచ్చారు. సాయంత్రం అమ్మవారిని డప్పు, వాయిద్యాల నడుమ చెరువు వద్ద ఉన్న సల్లాపురమ్మ ఆలయం వద్దకు తీసుకెళ్లి పూజలు చేపట్టారు. భక్తులు గుడి చుట్టూ పన్నారపు బండ్లు తిప్పుతూ సందడి చేశారు. సాయంత్రం కుందేళ్లను వదిలి వాటిని వేటాడి (పార్వేట) చంపారు. యువత టెంకాయలు, చీనీకాయలు, నిమ్మకాయలను విసరడం లాంటి పందేలు ఆడారు. ఆలయ ప్రాంగణం భక్తులు, అంగళ్లతో కళకళలాడింది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.